ప్రాయశ్చిత్తం

సుందరరావు అంత ఆలస్యంగా ఎప్పుడూ ఇంటికిరా లేదు.

ఆ రోజు రాక తప్పిందికాదు. కలెక్టరుగారు ఆఫీసు విషయాలు మాట్లాడుతూ చాలాసేపు ఉంచారు.

ఇంటిదగ్గర భార్య ఒంటరిగా ఉంటుందనీ తనరాక కోసం నిరీక్షిస్తూ ఉంటుందనీ సుందరరావుకు తోచకపోలేదు. కాని ఏం చేస్తాడు! పెద్ద అధికారితో ఈ మాట చెపటం కూడా అంత సభ్యమైన విషయం కాదు. చివరకు రాత్రిపది గంటల బండి అందుకోగలిగాడు. నరసారావుపేటలో దిగేస రికి పన్నెండు గంటలు అయింది. జట్కాబళ్ళు ఉన్నవి. కాని ఊళ్ళోకి మనిషికి ఒకరూపాయి అడిగాడు. గుంటూరునుంచి నరసారావుపేట రావటానికే రూపాయి కాలేదు. స్టేషను నుంచి ఊళ్ళోకి రూపాయి ఇయ్యటం చాలా ఎక్కువ అని పించింది.

నెలకు అరవయ్యో డెబ్భయ్యో సంపాదిస్తున్న తాలూకా గుమాస్తా జట్కాకు రూపాయి యిస్తే, ఇక సం సారం గడిచినట్లే! అందుకని సుందరం, పాపం, కాళ్ళీడ్చు కొంటూ తన ఇంటికి ఆ మైలు దూరం నడిచే వెళ్ళాడు.

ఆరోజు సుందరం మనస్సు ఏమీ బాగుండలేదు. పాపిష్టి మనస్సు, ఏవేవో ఊహాలు అతని మనస్సు చుట్టూ

ఝుంకారాలు చేసినవి, భార్యను గురించి విపరీతమైన భయాలు అతన్ని చుట్టుకొన్నాయి.

పాపం, ఆపిల్ల కాపరానికి వచ్చి ఎన్నో రోజులు కాలేదు. ఆ అమ్మాయిని గురించి ఇతడు ఇల్లా దరిద్రపు ఆలోచనలు చేస్తున్నాడు ఆ ఈడులో ఉన్న కుఱ్ఱవాళ్ళకు అల్లాంటి ఆలోచనలు రావటమో, లేకపోతే ఈ సుందరం మనస్సుకు ఇది ప్రత్యేక లక్షణమో నేను చెప్పలేను. అదీకాక ముందు రాబోయే ఆపదలు, మనస్సుకు ఛాయామాత్రంగా గోచరంఅవుతయి అంటారు. అదేమో- చెప్పలేము. కాని సుందరం మనస్సు నరకం అయిపోయింది. ఎప్పుడూ అతడుఊహించని భావాలులేచి అతని మనోరంగంపై భయంకర నృత్యాం చేసినవి.

* * *

ఒకసారి ఆ అమ్మాయి సినిమాకు వెళ్ళింది. పక్క ఇంటి ఆవిడతో కలిసి.

మళ్ళీ తిరిగి వచ్చేటప్పుడు ఆవిడతో రాక, వెనకబడి ఒంటిరిగా ఆలస్యంగా వచ్చింది. ఆమెతో కలిసి రాలేను. అదేమి అంటే, కారణం చెప్పింది.

* * *

సుందరానికిఇంకోవిషయంకూడా జ్ఞాపకానికివచ్చింది. తాను సాయంత్రం ఆరుగంటలకు కాని ఏడు గంటలకు కాని ఇంటికి వచ్చేసరికి, ఆపిల్ల వీధిగుమ్మంలోనే నిలబడి ఉండేది.

తన కోసమే నిరీక్షిస్తూ నిలబడ్డదని అనుకొన్నాడు. ఆ విషయం ఇప్పుడు ఆలోచించుకొంటే, అతనికి ఇంకోవిధంగా అర్థం అవుతున్నది.

*　　　　*　　　　*

"నేను ప్రొద్దున పదిగంటలకు ఆఫీసుకు పోతాను. సాయంత్రం ఆరింటికో ఏడింటికో వస్తాను. ఈ మధ్యకాలంలో అది ఏంజేస్తూకూర్చున్నదో ఎవరికి తెలుసు?" అనుకొన్నాడు.

సుందరం ఒకసారి ఆ పిల్లతో అన్నాడు, తన తల్లిని తీసుకొని వస్తాను-అని, అప్పుడు ఆ పిల్ల మాత్రం ఇష్టం కనపరచలేదు. మెదలకుండా ఊరుకొంది—దానికి ఇష్టంలేదు! ఇంత ఆలోచన కడుపులో పెట్టుకొని ఊరుకొంది!—లేకపోతే ఎందుకు అనదు, తప్పక తీసుకొనిరండి అని! ఆవిడవస్తే వంటకూడా ఆవిడే చేస్తుందాయె! తన కేమీ పని ఉండదు. హాయిగా కూర్చోవచ్చు. అయినా నోరువిప్పి "సరే" అనలేదు.

ఎక్కడికైనా, బైటికి వెళ్ళే సమయంలో ఎంతో అలంకారం చేస్తుంది. స్నో రాస్తుంది, పౌడరు వేస్తుంది, పూలు పెడుతుంది, కొత్తచీర కడుతుంది.

ఇంకా ఇంకా తమాషాలు చేస్తుంది. ఇంట్లో ఉన్నప్పుడు చెయ్యదేం? తన కళ్ళముందు ఏమన్నా దరిద్రంగా చినిగిపోయిన బట్టకట్టుకొని కనపడుతుంది! ప్రపంచానికి, అందంగా అలంకరించుకొని కనపడుతుంది!

ఇన్నాళ్ళబట్టి సుందరం ఈ విషయాలేవీ ఆలోచించ లేదు. మైకం కమ్మినట్లు ప్రవర్తించాడు.

ఆ నిశీథాన, ఒంటరిగా నడుస్తూ ఉంటే ఈ విషయా లన్నీ తోచినవి. చెప్పకూడదు కాని అతనికి చాలా దరిద్రపు ఆలోచనలు వచ్చినాయి.

ప్రొద్దున తాను బయలు దేరినపుడు ఆ అమ్మాయి వీధిగుమ్మందాకా వచ్చి, "ఏమండీ! రాత్రిబండికి ఇంటికి వస్తారా?" అని అడిగింది.

ఎందుకు అడిగింది అంత ఆదుర్దాగా? సుందరం ఈవిష యమైకూడా తీవ్రంగా ఆలోచించాడు.

"తొందరలో పనిపూర్తి చేసుకొని సాయంత్రం బండికి రండి"—అన్నది నవ్వుతూ!

నేను "రాను" అని చెప్పినా ఎందు కల్లాగ అన్నది.

రాత్రి బండికి తాను రావటానికి ఏమాత్రమైనా అవ కాశం ఉందో లేదో తెలిసికొంటానికేగా! దీని కడుపు బంగారంగానూ, ఎన్ని ఎన్ని ఆలోచనలు ఉన్నవి! అని అనుకొని సుందరం గబగబా ఇంటికి నడిచి పోయినాడు.

౨

ఇంట్లో దీపంలేదు. తలుపులు అన్నీ వేసిఉన్నవి. దీపం ఆర్పి పడుకుంటానికి కారణం ఏమైయుంటుందో అతనుఊహిం

చలేక పోయినాడు. ఈ విషయం అతని అనుమానాన్ని బాగా బలపరిచింది.

ఒక్క నిమిషం ఇంటిముందు నుంచుని ఆలోచించాడు. "ఏదో, ఈ సంగతి ఇవ్వాళ తేలిపోవాలె" అని నిశ్చయించుకొన్నాడు.

ముందు దొడ్డివైపుకు వెళ్ళి అటు తలుపుకు బైటగొళ్ళెం పెట్టాడు. లోపలున్న మనిషి బయటికి పోవాలంటే ఇక మార్గంలేదు. వీధివాకిట్లో తాను ఉండనే ఉండె!

ఆ తరువాత కిటికీలోనుంచి తొంగి చూశాడు. కాని ఏమీ కనుపించలేదు. పడకగది తలుపుకూడా ఓరవాకిలిగా వేసిఉంది.

గదిలో పడుకొని ఉంటుంది ఆ పిల్ల, వీధితలుపుకొడితే తలుపు తీయాలిగదా. ఏదైనాదుర్ప్రవర్తనలోఉన్నట్టయితే పట్టుబడుతుంది.

వీధి తలుపు కొట్టాడు.

"జానకీ జానకీ!" అని గట్టిగా పిలిచాడు. ఎవరూ పలకలేదు.

లోపల ఎవరో లేచి తిరుగుతున్నట్లు అనుమానం కలిగింది సుందరానికి. దొడ్డి గుమ్మంపైపు ఎవరో ఇద్దరు మనుష్యులు నడుస్తున్నారు అనుకొన్నాడు. ఏం లాభం—ఆ వైపు ద్వారానికి బయట గొళ్ళెం పెట్టాడుగా!

సుందరానికి కాస్త నవ్వు వచ్చింది. విజయ సూచక మైన నవ్వు అది కాని లోపల అసూయ అతని హృదయాన్ని దహించి వేస్తున్నది.

తన భార్య ప్రీతివాక్యాలతో తనను ప్రేమిస్తున్నట్లు భ్రమపెట్టి మోసగించింది. "దీనిని ఏం జేసినా పాపంలేదు–" అనుకొన్నాడు.

పాపం అతని గుండెలు దడ దడ కొట్టుకొన్నాయి. తన భార్య అటువంటి మనిషా ఇంతకూ!

మళ్ళీ తలుపుకొట్టాడు—జవాబు లేదు.

ఇంకా గట్టిగా కొట్టాడు—ఏమీ జవాబు లేదు.

ఎంత మొద్దు నిద్రఅయినా ఇంకా మెలకువ రాకుండా ఉండటం అసంభవం.

సుందరం ఒక్క క్షణం ఆలోచించాడు. ఆఅమ్మాయికి మెలకువ వచ్చే ఉంటుంది.

కాని తలుపు ఎట్లా తీస్తుంది, తన దుర్మార్గం బైట పడుతుందా మొ! అందుకని ఏమీ తోచక ఊరుకొని ఉంటుంది అనుకొన్నాడు.

తలుపు కొట్టి కొట్టి విసిగి, నేను ఇంట్లో లేననీ, బాబాయిగారి ఇంటికో, లేకపోతే ఏస్నేహితురాలు ఇంటికో వెళ్ళి పడుకొన్నాననీ, అనుకొంటాడు, నాకోసం వెతకటానికి వెడతాడు, అప్పుడు ఏదో ఉపాయంచేసి నా దుర్మార్గాన్ని

కప్పిపుచ్చుకోవచ్చును—అని ఆ పిల్ల ఊహించి, పలకటం లేదని సుందరానికి తోచింది.

ఇల్లాగ తోచటంలో విపరీతం ఏమీ లేదు సుందరం చాలా తెలివైనవాడు. బి. ఏ. ప్యాసు అయినాడు. తాలూకా గుమస్తా చేస్తున్నాడు. ఇటువంటి విషయాలలో అతనిబుద్ధి చాలా చురుగ్గా పనిచేస్తుంది-ఎందుకంటే, అతను కవిత్వంకూడా వ్రాసే మనిషి!

అయినా మళ్ళీ తలుపు కొట్టి గట్టిగా పిలిచాడు. ఎవ్వరూ పలకలేదు.

దుర్మార్గం చేస్తున్న మనిషి కాబట్టే పలకటానికినోరు రావటంలేదని అతనికి గట్టినమ్మకమే! అయినా వాళ్ళ బాబాయిగారి యింటికి వెళ్ళి చూచి ఆ అనుమానంకూడా తీర్చుకోనటం మంచిదని అతనికి తోచింది.

వెంటనే దొడ్లోకి వెళ్ళి, ఆ తలుపుకు బైట గొళ్ళెం పెట్టి ఉన్నట్లు మరొకసారి చూచుకొని, వీధిగుమ్మానికి కూడా బైట గొళ్ళెం పెట్టి బయలుదేరాడు.

పక్క వీధిలోకివెళ్ళి, తన పిన్నత్తగారిని లేపి "ఏమండీ, మీ అమ్మాయి ఉందా?" అని అడిగాడు.

"అదేమిటి నాయనా! ఎక్కడికెళ్ళింది జానకి? మా యింటికి రాలేదే? నువ్వు ఎక్కడికి వెళ్ళావు?—" అని ప్రశ్నపైన ప్రశ్న అడిగారు.

సుందరం క్లుప్తంగా జవాబులు చెప్పి "నేను ఈ రాత్రికి రాను అనుకొని ఎవరింట్లోనైనా పడుకుంటాదేమో లెండి ఒకర్తె ఇంట్లో పడుకోలేక!" అని చెప్పి "ఈ రాత్రికి నీవు ఇక్కడ పడుకో అబ్బాయ్" అని అన్నమాట వినిపించుకోకుండా గబ గబా నడిచి తిరిగి ఇంటికి వెళ్ళి పోయినాడు.

ఆమె వెళ్ళి భర్తను లేపి చెప్పింది; ముసలాయన లేచి, "ఆ ఇంట్లోనే పడుకొని ఉంటుందే పిల్ల! అన్నాడు.

అయ్యో శాస్త్ర వెళ్ళి చూచిరండి సంగతి ఏమిటో! ఇంట్లో ఉంటే ఎన్నిసార్లు పిలిచినా ఎందుకు పలకదూ?" — అన్నది.

ముసలాయన ఒక చేత్తో కర్ర, మరొక చేత్తో లాంతరు పుచ్చుకొని బయలుదేరాడు. దారిలో లక్ష్మయ్య, తిరువెంగళం కనపడి "ఏమయ్యా, ఈ అర్థరాత్రి వేళ యాడికో ఎళ్ళుతున్నావూ?" అని అడిగారు.

"మా జానకమ్మగారి ఇంటికి. అల్లుడు అర్థరాత్రి బండికి వచ్చాడు. పిల్ల లోపల నిద్రపోతూ ఉన్నదో ఏమో ఎన్ని పిలిచినా పలకలేదని వచ్చి చెప్పాడు. సంగతేమిటో చూద్దామని వెడుతున్నా" నన్నాడు.

ఆ వూళ్ళో సుందరాన్ని జానకమ్మను ఎరుగని వారు లేరు.

లక్ష్మమ్మ, తిరువెంగళం, దారిలో కనపడ్డ వాళ్ళతో ఈ సంగతి చెప్పారు కామాలు, పదినిమిషాలలో, ఒక ఇరవై లాంతర్లు బయలుదేరినై–సుందరం ఇంటి వైపుకు.

ఈ లోపున సుందరం, తన ఇంటిముందు అరుగుపైన కూర్చుని ఆలోచిస్తున్నాడు.

అతడు పిన్నత్తగారింటికి వెళ్ళటం చాలా తెలివి తక్కువపని. జానకి పడుకోటానికి ఎవరింటికైనా వెళ్ళి ఉన్నట్లయితే, బైట తాళంవేసి వెళ్ళుతుంది. వీధివైపుగాని దొడ్డివైపునగాని బైటతాళం వేసిలేదు. పైగా లోపల గడి యపడి ఉందే! అల్లాంటప్పుడు ఆమె ఎక్కడికైనా వెళ్ళి ఉంది అనుకోటం వట్టి తెలివి తక్కువపనిగాక మరేమిటి!

తనుచేసిన తెలివితక్కువ పనివలన ఊళ్ళో వాళ్ళంతా లేచి వస్తున్నారు.

ఛా–ఛా—ఎంత అల్లరి అయిపోయింది! జానకి దుష్ప్రవర్తన బయటపడ్డా ఫలాని అబ్బాయి భార్య అని చెప్పుకొంటారు గదా ఊరంతా!

సుందరం తాను చేసింది వెధవపని అని తెలుసు కొన్నాడు. విచార పడ్డాడు కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. ఇప్పుడేం చేస్తాడు! ఆ వచ్చిన వాళ్ళ అందరికి ఏం చెపు తాడు? ఈ దరిద్రపు అవస్థలోనుంచి బైట పడడం ఎల్లాగ?

జానకమ్మ తలుపుతీస్తే, వీళ్ళందరినీ వెళ్ళండి అన వచ్చు అందుకని తలుపు గట్టిగా కొట్టి "జానకీ—తలుపు తియ్యి. మీా బాబాయి వాళ్ళూ అంతా వస్తున్నారు. వప్పనతీయి, అల్లరి పడిపోతాము," అని కేకవేశాడు.

లోపలనుంచి జబాబు రాలేదు. వాళ్ళంతా వస్తున్నారు సుందరానికి ఇక ఏం చేయటానికి తోచలేదు. నిద్ర ముంచుకు పోతున్నది. అల్లరిపాలు అయినందుకు ఏడ్పు కూడా వచ్చింది.

అంతా లాంతర్లు తీసుకు వచ్చారు. ఆ వచ్చిన వాళ్ళల్లో చాలా మందికి సంగతి ఏమిటో సరిగా తెలియదు.

జానకమ్మ తలుపు లేసుకొని లోపల పడుకుని, ఎంత పిలచినా పలకటం లేదని కొందరనుకొన్నారు

"ఏమిా ఎందుకు తీయదూ...?"

"ఏమోనమ్మా, మనకేం తెలుస్తుంది. వాళ్ళ ఇద్దరికీ ఏమున్నదో!"

"ఏమన్నా ఉండనీ-అర్ధరాత్రి వేళ మొగుడు ఇంటి కొస్తే, లోపల తింగురంగా అని పడుకుంటుందా? ఇంత వైపరీత్యం ఎక్కడా చూడలేదమ్మా!"

"ఎందుకు తీయదురా!—ఛా అల్లాంటి మనిషి కాదు ఆ పిల్ల, ఏదో వేరే కారణం అయి ఉంటుంది!"

"ఏం కారణమోనమ్మా, నా నోటితో నేను అన లేను, మొన్న సత్తినిపల్లిలో అంతే అయిందిగా! రాత్రి బాగానే ఉంది తెల్లవారే సరికి బిగుసుకు—పోయుంది!"

"నారాయణ! నారాయణ! ఏంకర్మమో నమ్మా!"

"అంతే అయి ఉంటుంది లేకపోతే ఎంత పిలిచినా ఎందుకు పలకదు అత్తా!"

"ఏమో నాయినా! మనమేమి చెప్పలేము. ప్రొద్దున చూశాను నాయినా—బంగారు తల్లి లాగున్నది"

"అయిదో నెల కామాలు అత్తయ్యా!"

"అవును తల్లీ"

"కడుపులో ఉన్నదానిని ఎట్లా వదిలేసి వెళ్ళాడమ్మా!"

"ఎక్కడికి వెళ్ళాడమ్మా, ప్రొద్దున గుంటూరు వెళ్ళి రాత్రికల్లా వచ్చేశాడు"

"ఎంతలోకి వచ్చింది!"

"అయితే, అత్తయ్యా వాతంవల్ల బిగుసుకుపోతారు. ఇది అంతే నంటావా!"

"శ్రీహరీ! ఎందుకు నాయనా మనం అనుకోటం"

"గర్భిణీ స్త్రీని బహు జాగ్రత్తగా కనిపెట్టి ఉండాలిరా!"

"ఏదో నాయినా, అయిదోనెలే గదా అని అశ్రద్ధ చేశాడు సుందరం. అయినా పాపం ఏం కర్మమో!"

ఇల్లాగ తలోమాట అనుకొంటూ సుందరం స్నేహి తులూ బంధుగులూ అంతా వచ్చారు

ముసలమ్మగారు వచ్చి, ఏడ్వటానికి సిద్ధంగాఉన్న సుందరాన్ని కౌగలించుకొని "ఏం నాయినా! దుఃఖపడబోకు, చూద్దాము అసలుసంగతి ఏమిటో, ఊరుకో నాయినా," అని ఓదార్చింది.

సుందరం మనసు ఏమీ బాగుండలేదు ఈ అప్రతిష్ఠ ఏమిట్రా బాబూ" అని అతడు అసలే దిగులుతో కూర్చు న్నాడు. ముసలమ్మగారి మాటలు అతని మనస్సును ఏదో విధంగా మార్చినవి. ఆమెగారు కౌగలించుకొని ఏడిచేసరికి సుందరంకూడా జావ అయిపోయి బొట బొట కన్నీళ్ళు కార్చాడు.

ఇంకొక ఆవిడ అతని స్థితినిజూచి జాలిపడి అన్నది, "ఊరుకో నాయినా ఏంజేస్తాము. నీకు మటుకు ఏంతెలుసు ఇల్లా అవుతుందని "

సుందరానికి గుండె దడ దడ కొట్టుకున్నది: ఏదో జరిగిందన్న మాట ! తనలో పిచ్చి ఆలోచనలు చేశాడు. జరిగిన సంగతి ఏదో భయంకరమైందన్నమాట !

వీళ్ళందరికీ ఏదో కొంత తెలిసినట్లుకూడా ఉంది ! ఏమిటీ కర్మం !

అతనికి కాళ్ళు గజ గజ వణికిపోయినాయి. ఆ అమ్మాయని అనుమానించి, పాపిష్టి మాటలన్నీ అనుకున్నందుకు సుందరం ఇప్పుడు విచార పడ్డాడు.

తనభార్య గర్భిణీస్త్రీ అనికూడా ఇప్పుడతనికి జ్ఞప్తికి వచ్చింది. అట్టి స్థితిలో ఉన్న బిడ్డనుగురించి దరిద్రపు విషయాలన్నీ ఆలోచించి నందుకు అతడు మరీ విచార పడ్డాడు.

పదినుంచీ అనుకొన్నమాటలు సుందరం పిన్నత్తగారు కూడా విన్నది కాబోలు!

ఆవిడ పరుగెత్తుకుంటూవచ్చి సుందరండగ్గిర నిలబడి, "ఏం నాయనా! ఏమిటా సంగతి? లోపల పడుకొన్నది పడుకొన్నట్లే బిగుసుకు పోయిందటగా! ఇదేం కర్మం నాయినా?" అంటూ గోలు గోలున ఏడ్చింది.

సుందరానికి ఏమీ చెపటానికి తోచలేదు. అయినా అతని కేం తెలుసు?

తనకంటే వీళ్ళకే ఏదో తెలిసినట్లున్నది! లేకపోతే ఎందుకు అట్లా అట్లా అంటారు.

సుందరం అరుగు మీద చతికిల బడ్డాడు. అతని మనస్సుఅంతా గందరగోళంగా ఉంది.

జానకి లోపల పడుకొని, బిగుసుకు పోయిందా?

పొద్దుటినుంచీ వాళ్ళంతా అను కొంటూనే ఉన్నారు కాబోలు ఇల్లాజరగవచ్చునని! సుందరం బిక్కముఖం పెట్టి కళ్ళనీళ్ళు కార్చాడు.

ఈ లోపున నలుగురూ నాలుగు చేతులు వేసి తలుపులు తేవసెత్తారు. లాంతర్లు తీసికొని లోపల ప్రవేశించారు. సుందరం పిన్నత్తగారూ, ముసలమ్మగారూ, లక్ష్మయ్య, తిరువెంగళం, హెడ్ గుమాస్తాగారూ, లెక్కల మాస్టారు, కోమటి పుల్లయ్య, రత్తమ్మ మహాలక్ష్మి, సాంబశివరావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు మొదలైన విద్యార్థులూ,—

ఏడుకొండలు, పైడితల్లి మొదలైన కార్మికులూ, కోటిరెడ్డి, సీతారామ చౌదరి మొదలైన కర్షకులూ అంతా లోపలికి వచ్చారు.

ముసలమ్మగారు, "జానకీ! జానకీ!" అంటూ పడక గదిలోకి పరుగెత్తింది. ఆమె వెంట ఆడవాళ్ళంతా వెళ్ళారు.

జానకమ్మ మంచంపైన పడుకొని ఉంది. తెల్లచీర కట్టుకొంది. జరీపేటగల నల్లనిరవిక తొడుక్కున్నది. తలలో పూలు పెట్టుకొని ఒత్తిగిలి పడుకొని ఉన్నది.

సుందరం అత్తగారు జానకమ్మ మీద చెయ్యివేసి, 'అమ్మాయీ నాతల్లీ ఏమిటే నాతల్లీ!"—అని ఏడ్వటం సాగించింది.

ముసలమ్మగారు "ఒళ్ళు వెచ్చగా ఉందర్రా?" అని అడిగింది.

రత్తమ్మ కాళ్ళూ చేతులూ ముట్టుకొని చూచి, 'ఇంకా వేడిగానే ఉన్నాయి?" అన్నది.

"డాక్టరును పిలవండ్రా" అని ఎవరో కేకలువేశారు.

ముసలాయనకు కాస్త నాడి చూడటం తెలుసు. ఆయన వచ్చి చెయ్యిచూచి "ఏమీలేదు, మీరంతా బైట కెళ్ళండి"? అని కేకవేశాడు.

సుందరంవచ్చి జానకి మీద చెయ్యివేసి— "జానకీ"- అని పిలిచాడు, ఆ అమ్మాయి, ఆ-అంటూ దిగ్గున లేచికూ ర్చుని "ఇదేమిటి!—వీళ్ళంతా ఎందుకొచ్చారు," అన్నది కళ్ళు నులుము కుంటూ, ముసలాయన "ఇక వెళ్ళండర్రా అనవసరంగా గోలఅయింది," అంటూ ఒక్కొక్కరినే బయటికి పంపివేశాడు. ఆత్మ బంధువులు తప్ప, తక్కిన వాళ్ళంతా, నవ్వుకొంటూ వెళ్ళిపోయినారు.

3

అందరూ వెళ్ళి పోయిన తరువాత ముసలాయన జానకమ్మను అడిగాడు "ఇదేమిటే అమ్మాయ్ అల్లుడు అన్ని సార్లు పిలిచి తలుపు కొట్టాడాయె! పక్క ఇంటి వాళ్ళు అంతా లేచారు, బయట అంతగోల అవుతూ ఉంటే నీకు నిద్ర మెలకువ ఎందుకు రాలేదూ అంట! ఇదేదో విచిత్రంగా ఉందే!"

"అట్లాగా బాబాయ్? నాకు ఏమీ తెలియదే?"

"ఏమిటే అమ్మాయి! నమ్మటానికి వీలు లేకుండా ఉంటే!"

"నిజంగా బాబాయ్! గోల అయినట్లు తెలియదు నాకు, నేను సాక్షాత్తు వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ఉన్నాను!"

ఏమిటి తల్లీ అల్లా అంటావు.?

"కల బాబాయి; ఏమైందంటే నిన్న శుక్రవారం తలంటి పోసుకోవలసింది ఏదో బద్ధకంగా ఉండి నిన్న పోసుకోలేదు.

ఇవ్వాళ తలకు నీళ్ళు పోసుకొని శనివారం కాబట్టి ఒంటి పూట భోజనం చేసి రాత్రి కాస్త ఫలహారం చేసి పడుకొన్నాను. పది గంటల బండికి ఒక వేళ ఆయన వస్తా

రేమోనని బండి వచ్చిన తరువాత చాలాసేపు వరకు చూస్తూ కూర్చున్నాను."

"ఎందుకు కూర్చున్నావమ్మా? ఆయన రానని గట్టిగా చెప్పి వెళ్ళాడుటగా."

జానికమ్మ ఈ మాటవిని ముసి ముసి నవ్వులు నవ్వుకొని, "నాకు తెలును బాబాయ్! ఆయన ఇల్లు విడిచి ఒక్క పూట అయినా ఉండరు. ఏ రాత్రికైనా ఇంటికి వస్తారు. అందుకని చాలాసేపు కూర్చున్నాను, దాని తరువాత నిద్ర ఆపుకోలేక వెళ్ళి పడుకొన్నాను; మంచి నిద్రపట్టింది. ఆ నిద్రలో ఒక కల వచ్చింది—"

"ఏం కల అమ్మా?"

"చాలా తమాషాఅయిన కల—

"నేనుట, ఒక పెద్ద దేవాలయంలోకి వెళ్ళానుట. పెద్దగుడి, గోపురాలూ అన్నీ కనపడ్డవి. ఆ గోపుర శిఖరాలు బంగారపు పూత పోసినవి, ధగ ధగ మెరిసిపోతున్నాయి, దేవాలయం నిండా జనం కిట కిట లాడుతున్నారు. ఎట్లాగో కష్టం మీాద గర్భగుడి దగ్గరకు వెళ్ళాను.

"అక్కడ కొంతమంది ద్వార పాలకులు జనాన్ని ఆపేసి, నలుగురు, నలుగురిని లోపలికి పంపుతున్నారు.

ఎంతోసేపు ఉంటేనే కాని నాకు స్వామి వారి దర్శనం అయ్యే లాగున లేదు. దిగులుపడి నుంచున్నాను.

"ఇంతలో ఆ అర్చకులలో ఒకాయన నా దగ్గరకు వచ్చి "అమ్మాయ్, నీవు ఇప్పుడు లోపలికి ఎల్లాగ వెడతా వమ్మా? ఇంకా ఒక గంటసేపు ఉంటే నీకు స్వామి దర్శనం చేయిస్తాను తల్లీ! అంతవరకూ నీవు ఈ పూలు మాలలుగా గుచ్చు అమ్మా, స్వామికి పవళింపు సేవ సమయంలో కావాలి" అన్నాడు.

"ఆయన లావుగా ఉన్నాడు గండభేరుండంచువస్త్రాలు ధరించాడు పెద్ద వెడల్పు అయిన పట్టె వర్ధనాలు పెట్టు కొన్నాడు. ఆయన నా ముందు బుట్టెడు పూలు, కొన్ని అరటినార దారాలు పెట్టి నవ్వుతూ, "మాలలు కడదాంరా అమ్మా!" అని నాకు ఎదురుగా కూర్చున్నాడు.

"నేను పూలు దండలు దండలుగా గుచ్చి వేశాను, భక్తులు "గోవిందా, ఏడుకొండలవాడా! స్వామీ, జగద్రక్షకా!" అంటూ, ఆవేశంతో కేక లేస్తున్నారు.

"నా వళ్ళు పులకరెత్తింది బాబాయి!

"ఇంతలో దూరాన్నుంచి పిలుస్తున్నట్లు తోచింది.

"మీ అల్లుడే ఎక్కడినుంచో పిలుస్తారట! తలుపు కొట్టిన శబ్దంకూడా ఏదో తమాషాగా వినబడుతుంది. వెళ్ళాలనుకొంటానుట! మళ్ళీ ఈ భక్తుల అరుపులవలన నాలో సంతోషం పొంగిపోయి ఆ విషయము మరిచిపోతానుట.

"మళ్ళీ అయ్యో! స్వామికి పువ్వులమాలలు గుచ్చకుండా ఎల్లా వెళ్ళేదా" అని అనుకొంటానుట. ఇట్లా అనిపించింది.

"దబ్బున కానీ అమ్మా, స్వామి పవళింపు సేవకు సమయం కావస్తున్నది" అని నా ప్రక్కనున్న స్వామి నన్ను తొందర పెడతాడట.

"ఆ తరువాత నాకు ఏమీ తెలియలేదు. ఆయన, స్వామి దర్శనం చేద్దువుగాని స్వామికి నిద్రవేళ అయింది; లే, అమ్మా అని పిలిచాడు నేను 'ఆఁ' అంటూలేచాను. నేను లేచి చూచేసరికి ఈ స్వామి కనపడ్డారు"

ఇల్లా చెప్పి, కలలో స్వామి దర్శనం కాలేదు బాబాయ్?" అని జానికమ్మ జాలిగా చూచింది.

ముసలాయన, ఆయన భార్యకూడా జానకమ్మను కౌగలించుకొన్నారు.

"నా తల్లి! నా తల్లి! ఎంత మంచి కలగన్నావమ్మా, నీకు మగపిల్లవాడు పుడతాడే నా తల్లి! వెంకటేశ్వర్లు పేరు పెట్టుకో", అన్నది ముసలమ్మగారు. అప్పుడే పసుపుగుడ్డలో ఒక రూపాయి ముడుపు గట్టారు. జానకమ్మ, ముసలమ్మ, రత్తమ్మ, ముసలాయన మొదలైన ఆప్తబంధువులు అంతా కూడా, దేముడి గదిలోకి పోయినారు. స్వామి వారి ఎదుట నిలబడి నమస్కరించారు. జానకమ్మను కలలోకనుపించాడు. ఆ అమ్మాయి భక్తురాలు అల్లాంటి బిడ్డను గురించి తెలివి తక్కువ ప్రసంగాలు చేసినందుకు వాళ్ళు అంతా పశ్చాత్తాపంతో చెంపలు వేసుకొన్నారు.

జానకమ్మ, సుందరం, ముడుపుగట్టిన గుడ్డ స్వామి పాదాలవద్ద ఉంచి, కళ్ళుమూసుకొని ధ్యానంచేసి, మనస్సులో మొక్కుకొన్నారు. దాని తరువాత "మీ రేమను కొన్నారు—మీ రేమను కొన్నా"రని భార్యా భర్తలు మాట్లాడుకోవటంలో తేలిన విషయాలు ఇవి—

"స్వామీ, నేను, ఆయనకూడా, నీ వరప్రసాద లబ్ధుడైన కొడుకును ఎత్తుకొని కొండ ఎక్కుతాము తండ్రీ" అని

"స్వామీ, ఏడుకొండలవాడా, రక్షించు స్వామీ, నేనూ మా జానకీ, కొడుకును ఎత్తుకొని కొంగూ, కొంగూ

ముడేసుకొని కొండెక్కుతాము" అని మొక్కుకున్నాడు సుందరం.

తాను జానకినిగూర్చి పాపిష్ఠి ఆలోచనలు చేసినందుకు మనః పూర్వకంగా విచారపడి "స్వామీ అపరాధం జరిగింది క్షమించు" ఆ పాపం పోవటానికి, ప్రాయశ్చిత్త పూర్వకంగా కొండపైన కేశ ఖండన చేయించుకొంటానని కూడా సుందరం మొక్కుకొన్నాడు.